క్లుప్తంగా

శ్రీ కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోనా వెంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని భూదేవి, అలివేలి మంగమ్మ సమేత శ్రీ కోనా వెంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో కొండపైకి చేరి స్వామిని దర్శించుకున్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



స్కూల్ బస్సు డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి

గడివేముల: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నాగార్జునరెడ్డి హెచ్చరించారు. శనివారం స్కూల్ బస్సుల డ్రైవర్లకు, క్లీనర్లకు స్థానిక పోలీసు స్టేషన్‌లో అవగాహన కల్పించారు. అతివేగం వద్దని, రోడ్డు నిబంధనలు పాటించాలని, బస్సు కదిలేటప్పుడు చుట్టుపక్కల గమనించాలని ఎస్ఐ సూచించారు. ప్రతి డ్రైవర్ లైసెన్స్‌తోపాటు యూనిఫాం ధరించాలన్నారు. బస్సుల పర్మిట్, ఫిట్‌నెస్, పొల్యూషన్ సర్టిఫికెట్లు రెన్యూవల్ చేసుకోవాలన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సన్మానించిన సర్పంచ్, ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సచివాలయంలో ఐదేళ్లపాటు పనిచేసి బదిలీపై వెళ్లిన ఉద్యోగులను సర్పంచ్ బీఎస్ రామ్మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ జక్కుల సావిత్రి శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ పావని, పంచాయతీ సెక్రటరీ మాబాషా, కోఆప్షన్ సభ్యుడు ఉశేన్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు హరినాథరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, జక్కుల వెంకటరమణ, చింతల వెంకటరమణ, గోదా శ్రీనివాసులు, గోపాలయ్య పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు



గాయపడిన కృష్ణమాచారి

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ సమీపంలో జాతీయ రహదారిపై ఆటో, బైక్ ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. హైవే పెట్రోలింగ్ వాహన సిబ్బంది తెలిపిన వివరాలు.. సోమయాజులపల్లె గ్రామానికి చెందిన కృష్ణమాచారి, వెంకటేశా చారి వ్యక్తిగత పనులనిమిత్తం స్వగ్రామం నుంచి హుసేనాపురం వైపు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మార్గమధ్యలో కాల్వబుగ్గ సమీపంలోని కాకతీయ హై స్కూల్ ఎదురుగా ఉన్న మలుపు వద్ద పాలకొలను నుంచి హుసేనాపురం వైపు మలుపు తిరుగుతున్న ఆటోను గమనించకుండా బైక్ ఢీకొంది. ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరికీ రక్తగాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఓబులమ్మ చెరువుకు హద్దులు ఏర్పాటు



హద్దులు వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద ఉన్న ఓబులమ్మ చెరువుకు శనివారం హద్దులు ఏర్పాటు చేసినట్లు మైనర్ ఇరిగేషన్ ఏఈ చంద్రుడు, ఆర్ఐ రామ్ తెలిపారు. పాణ్యం రెవెన్యూ పరిధిలో ఉన్న 1638 సర్వేనంబర్‌లో 8.09ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉందన్నారు. ఇటీవల పలువురు సాగు చేస్తుండగా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయన్నారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు హద్దులు ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా హద్దులు చెరిపి ఆక్రమిస్తే కఠినం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సి.బెళగల్: తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం పెరుగుతుండటంతో తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి అన్నారు. నదికి ఎగువలోని హోస్పేట్ డ్యామ్ నుంచి 60 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని నదీతీర గ్రామాలైన తిమ్మందొడ్డి, సంగాల, గుండ్రేవుల, కొండాపురం, పల్‌దొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె, కె.సింగవరం, కొత్తకోట గ్రామ ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.



సి.బెళగల్ గురుకుల పాఠశాలలోని మొదటి అంతస్తులో తరగతి పైకప్పు కూలిన దృశ్యం



సి.బెళగల్ గురుకులంలో విద్యుత్ సదుపాయం లేని కారిడార్



గూడూరు బాలుర వసతిగృహాల్లో కటిక నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు



అమడగుంట్ల వసతిగృహంలో మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా ఉన్న బాత్‌రూమ్‌లు

సంక్షోభ హాస్టళ్లు

సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఈ హాస్టళ్లపై దృష్టి సారించడం లేదు. దీంతో కనీస సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలకృత్యాలు మొదలు ఆకలి దప్పుల వరకు అవస్థలే. ఇటీవలే సంక్షేమ హాస్టళ్ల దుస్థితిపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేసింది. అయినా, మార్పు రాలేదు. ఏ హాస్టల్ చూసినా అధ్వానంగానే ఉంది. కోడుమూరు నియోజకవర్గంలోని పలు హాస్టళ్లలో వసతులపై సాక్షి బృందం విజిట్ నిర్వహించింది. ఇందులో పలు సమస్యలు వెలుగుచూశాయి. సరైన బాత్‌రూంలు లేవు. విద్యార్థులు రాత్రి వేళల్లో నేలపై పడుకుని నిద్రిస్తున్నారు. ఇప్పటి వరకు దుప్పట్లు సరఫరా చేయకపోవడంతో ఇళ్ల వద్ద నుంచి దుప్పట్లు, బొంతలు తెచ్చుకుని వినియోగించుకుంటున్నారు. కిటికీలకు జాలర్లు సరిగ్గా లేకపోవడంతో దోమల బెడదతో అవస్థలు పడుతున్నారు. కొన్ని వసతి గృహాలకు ప్రహరీలు లేకపోవడంతో రాత్రి వేళల్లో పాములు, తేళ్లు తదితర విషపురుగుల సంచారంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటు కాలం వెల్లదీస్తున్నారు.

- సంక్షేమ వసతి గృహాలను పట్టించుకోని ప్రభుత్వం
- పెచ్చులూడి శిథిలావస్థకు చేరిన పలు భవనాలు
- కానరాని కనీస సౌకర్యాలు
- గాలిలో దీపంగా మారిన పేద పిల్లల భద్రత
- హైకోర్టు మొట్టికాయ వేసినా కానరాని స్పందన

కోడుమూరు రూరల్/ సి. బెళగల్ : కోడుమూరు నియోజకవర్గంలో మొత్తం 11 ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో కర్నూలు మండలంలో 1, గూడూరు మండలంలో 2, కోడుమూరు మండలంలో 6, సి. బెళగల్‌లో 2 ఉన్నాయి. ఈ హాస్టళ్లలో ఏ ఒక్కదాంట్లో కూడా పూర్తి స్థాయి సౌకర్యాలు లేవు. ఈ ఏడాది హాస్టళ్లు ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా విద్యార్థులకు బెడ్‌షీట్లు, ప్లేట్లు, గ్లాసులు తదితరవి మంజూరవ్వలేదు. దీంతో ఒక్కో దుప్పటిని ఇద్దరేసి విద్యార్థులు కప్పుకోవాల్సి వస్తోంది. కొందరు విద్యార్థులు దుప్పట్లు లేకుండా నిద్రిస్తున్నారు. అలాగే హాస్టల్ విద్యార్థులకు సంబంధించి గత 6 నెలల నుంచి కాస్మోటిక్ చార్జీలను సైతం ఇవ్వకపోవడంతో పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

➡ కోడుమూరులోని బీసీ, ఎస్సీ బాలికల హాస్టళ్లలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. బోర్లు లేకపోవడంతో రెండు హాస్టళ్ల విద్యార్థులు పూర్తిగా గ్రామ పంచాయతీ సరఫరా చేసే కుళాయిల నీటిపైనే ఆధారపడాల్సి వస్తోంది. బాత్‌రూమ్‌ల సమస్య కూడా తీవ్రంగా ఉంది.

➡ లద్దగిరి బీసీ వెల్ఫేర్ వసతి గృహం–1లో 145 మంది విద్యార్థులుండగా, వసతి గృహం–2లో 155 మంది ఉన్నారు. ఒక గదిలో నిలబడితే 150 మంది సరిపోదు అలాంటి గదిలో రాత్రి పూట 100 మంది నిద్రపోవాల్సిన పరిస్థితి. 300 మంది విద్యార్థులకు సరిపడే బాత్‌రూమ్‌లు లేక ఆరుబయట స్నానాలు చేస్తున్నారు.

➡ కోడుమూరు మండలంలోని గోరంట్ల గురుకుల పాఠశాల, అమడగుంట్ల బీసీ హాస్టళ్లకు కాంపౌండ్ వాల్ లేక నిత్యం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

➡ గూడూరులోని ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహంలో 150 మంది విద్యార్థులున్నారు. అయితే వసతిగృహానికి సంబంధించి కిటికీలు, తలుపులు దెబ్బతినడంతో చలిగాలులు, దోమల బెడదకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

➡ సి. బెళగల్‌లోని బీసీ హాస్టల్‌లో 260 మంది విద్యార్థులు ఉన్నారు. వీరు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఈ మండలంలోని రెండు హాస్టళ్లకు ప్రహరీ లేకపోగా, విద్యార్థులు ఉండేందుకు సరిపడ గదులూ లేవు. దీంతో ఇరుకు గదుల్లో విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు. బీసీ హాస్టల్లో 2019లో 60 మంచాలు మంజూరయ్యాయి. అయితే గదుల నిర్మాణం మంచాల ఎత్తుకు దాదాపు సమానంగా ఉండటంతో విద్యార్థులకు ఫ్యాన్లు తగిలి గాయపడేవారు. దీంతో వాటిని తొలగించారు.



ప్రమాదకరంగా స్విచ్ బోర్డు

➡ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి నుంచి ఇంటర్ రెండవ సంవత్సరం వరకు దాదాపు 640 మంది చదువుకుంటున్నారు. ఇక్కడ అనేక సమస్యలు ఉన్నాయి. నీటి నిల్వకోసం కనీసం సంపుగానీ, ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం గానీ జరగలేదు. నీటి కొరతతో మరుగుదొడ్లు, స్నానపు గదులు నిరుపయోగంగా మారాయి. కాలకృత్యాలు తీర్చుకునేందుకు విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తుంది. విద్యార్థుల విశ్రాంతి కోసం ఏర్పాటు చేసిన డార్మెట్రిలలో లైట్లు, ఫ్యాన్లు, స్విచ్ బోర్డులు పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు తరగతి గదుల్లో నిద్రిస్తున్నారు. అలాగే గురుకులంలోని మొదటి అంతస్తులో ఉన్న 11 తరగతి గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి.



లద్దగిరి హాస్టల్లో బాత్ రూమ్‌లు లేక ఆరు బయట స్నానం చేస్తున్న విద్యార్థులు



సి.బెళగల్ హాస్టల్లో సరిపడ గదుల్లేక ట్రంకు పెట్టెలపై పడుకున్న విద్యార్థులు

➡ నియోజకవర్గంలోని అన్ని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు వంట వండేందుకు కావాల్సిన వంట మనుషులు పూర్తిగా లేరు. దీంతో వార్డెన్లు ఉన్న కొందరితోనే పనిచేయించుకుంటున్నారు. కొన్ని హాస్టళ్లలో స్వీపర్లు లేక వంట మనుషులతోనే హాస్టళ్లను శుభ్రం చేయించాల్సిన పరిస్థితి దాపురించింది. అలాగే ఒకే వార్డెన్‌కు రెండు, మూడు హాస్టళ్ల ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పజెప్పడంతో విధులు సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి.

పేరుకే గురుకులం.. అంతా అపరిశుభ్రం!

పాణ్యం: మండల కేంద్రంలోని బనగానపల్లె రహదారిలో ఉన్న గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు అపరిశుభ్ర వాతావరణంలో కాలం వెల్లదీస్తున్నారు. ఇక్కడ 228 మంది విద్యార్థులున్నారు. పాఠశాల నుంచి విడుదలయ్యే మురుగు నీరు ప్రైవేట్ వ్యక్తి స్థలంలోకి వెళ్తుండటంతో అతడు కోర్టును ఆశ్రయించడంతో అక్కడి నుంచి ఖాళీ చేసి ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు నెరవాడ మెట్ట వద్ద మినీ గురుకులం పాఠశాలలోకి నెలక్రితమే మార్చారు. అయితే పాఠశాలలో ఇరుకు గదులు, పాఠశాల ముందే ఎస్సార్‌బీసీ కాల్వ, పిచ్చిమొక్కలు, గడ్డి ఉండడంతో విద్యార్థులు రోజూ నరకం అనుభవిస్తున్నారు. రెండు బాత్‌రూమ్‌లు ఉండడంతో విద్యార్థులు పొలాల గట్లపై మలవిసర్జన చేస్తుండడంతో ఇక్కడి రైతులు కూడా పలుమార్లు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాల ముందు ఎస్సార్‌బీసీ నీటి ప్రవాహం, కాల్వ వెంట గడ్డి ఉన్నా అక్కడే విద్యార్థులు స్నానాలు చేయడం, భోజనానంతరం ప్లేట్లు శుభ్రం చేసుకోవాల్సి ఉంటుంది. వంటగది పక్కనే ఏపుగా పెరిగిన గడ్డి, అందులో నుంచి బయటకు వెళ్లే మురుగునీటితో పరిసరాలు కంపు కొడుతున్నాయి.



అపరిశుభ్ర వాతావరణంలో పాణ్యం గిరిజన గురుకుల పాఠశాల

స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

కోడుమూరు రూరల్: ప్రజలకు భారంగా మారిన స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. ఈ అంశంపై శనివారం కోడుమూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ప్రజా సంఘాల నాయకులతో కలిసి సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలపై మోయలేని విధంగా చార్జీల భారం వేస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులగొట్టండన్న టీడీపీ నాయకులు, నేడు చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వారు విద్యుత్ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు దూళ్ల భాస్కర్, శేషుకుమార్, చిన్నరాముడు, హమాలీ, ఆటో యూనియన్, జీపు డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యుత్ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

అనాథలకు ఆధార్ కార్డు ఇప్పించండి

– శిశు సంక్షేమ శాఖ డీసీపీఓ శారద

కర్నూలు (న్యూటౌన్): అనాథలను గుర్తించి ఆధార్ కార్డును ఇప్పించడం అందరి బాధ్యత అని శిశు సంక్షేమ శాఖ డీసీపీఓ శారద అన్నారు. శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో శనివారం బంగారుపేటలో నిర్వహించిన సమావేశంలో డీసీపీఓ శారద, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కమిటీ సభ్యులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్య, వైద్యం, పునరావాసం, షెల్టర్ హోమ్‌లలో ప్రవేశం, సంక్షేమ పథకాలు పొందాలంటే ఆధార్ తప్పనిసరి అన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర మాట్లాడుతూ వీలైనంత త్వరగా ఆధార్ గుర్తింపునిచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూపరింటెండెంట్ రాజశేఖర్, అడ్వకేట్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీఓ శారద

తల్లిపాలు బిడ్డకు మేలు

కర్నూలు(రూరల్): తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని జిల్లా నోడల్ అధికారి డాక్టరు రఘు అన్నారు. మండల పరిధిలో భూపాల్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రముఖ్యతపై బాలింతాలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. జిల్లా నోడల్ అధికారి మాట్లాడుతూ ముర్రుపాలు శిశువుకు సులభంగా జీర్ణమవుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు హేమలత, ఆరోగ్య అధికారి వెంకటరమణ, క్షేత్రస్థాయి పర్యవేక్షకురాలు నాగమణి, సామాజిక ఆరోగ్య అధికారి యశోద, అంగన్ వాడీ టీచర్ లక్ష్మదేవి తదియితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి డాక్టరు రఘు, వైద్యాధికారిణి హేమలత

కేతవరం విద్యార్థికి బంగారు పతకం

ఓర్వకల్లు: మండలంలోని కేతవరం గ్రామానికి చెందిన కొమెర అక్కమ్మ, మేకల సిద్దయ్య దంపతుల కుమారుడు శ్రీకాంత్ పీజీలో రెండు బంగారు పతకాలు సాధించాడు. స్థానిక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రాథమిక విద్యను పూర్తి చేసిన శ్రీకాంత్ 6నుంచి 10వ తరగతి వరకు నందికొట్కూరు వేలాంగణి మాత పాఠశాలలో ఇంటర్ చిన్నటేకూరు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ కళాశాలలో, అగ్రికల్చర్ బీఎస్సీ మహానంది వ్యవసాయ కళాశాలలో, అగ్రికల్చర్ ఎమ్మెస్సీ తిరుపతి వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పూర్తి చేశాడు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో మాలిక్యులార్ బయోలజీ, బయోటెక్నాలజీ ప్లాంట్, బయోకెమిస్ట్రీ సబ్జెక్టుల్లో అత్యుత్తమ ప్రతిభను కనపరచడంతో విశ్వవిద్యాలయ యాజమాన్యం రెండు బంగారు పతకాలను ప్రదానం చేసింది. ఈనెల 24న ఎన్జీ రంగా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకున్న శ్రీకాంత్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థి కొమిరె శ్రీకాంత్

సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్ ఏఎస్పీ మంద జావళి అల్ఫోస్

పాణ్యం: మండల పరిధిలోని పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీని జిల్లా అడిసినల్ ఏఎస్పీ మంద జావళి అల్ఫోస్ శనివారం పరిశీలించారు. ఫ్యాక్టరీ సమీపంలోని పేళ్ల నివారణకు వాడే పదార్థాలు నిల్వ ఉంచే గదులను, సిమెంట్‌రాయి తీసుకునే ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిబంధనలు పాటించాలని సూచించారు. ఏఎస్పీ వెంట ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఉన్నారు.

సరిహద్దుల పరిశీలన



సరిహద్దులను పరిశీలిస్తున్న దృశ్యం

గడివేముల: మండల పరిధిలోని గని గ్రామంలోని అటవీశాఖ, ప్రభుత్వ భూముల హద్దులను నంద్యాల ఆర్‌డీఓ విశ్వనాథ్ శనివారం పరిశీలించారు. కొన్ని రోజుల నుంచి అటవీశాఖ, రెవెన్యూ శాఖకు సంబంధించిన భూముల హద్దుల వివాదం నెలకొంది. దీంతో ఎఫ్ఆర్ఓ ప్రవీణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ల్యాండ్ సర్వేయర్ శ్రీరామ్మోహన్, తహసీల్దార్ వెంకటరమణల ఆధ్వర్యంలో కొలతలు వేశారు. గ్రామంలో ఒకే సర్వేనెంబర్‌లో పొలం అధికంగా ఉండటంతో కొలతలు వేయడానికి ఇబ్బందిగా మారింది. త్వరలోనే రెండు శాఖల మధ్య సరిహద్దులను గుర్తించి రాళ్లను ఏర్పాటు చేస్తామని ఆర్‌డీఓ తెలిపారు.

కార్గిల్ విజయ్ దివస్ విజయోత్సవ ర్యాలీ

కర్నూలు (సెంట్రల్): అఖిల భారత విద్యార్థి సమాఖ్య నగర శాఖ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి వెంకట గోపి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ స్థానిక విశ్వేశ్వరయ్య సర్కిల్ నుంచి ప్రారంభమై వినాయక ఘాట్ మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగింది. ఇక్కడ కార్గిల్ యుద్ధ వీరులకు దివిటీలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో విభాగ్ ప్రముఖ్ నాగఫణి శాస్త్రి పాల్గొన్నారు.

మచ్చలేని నాయకుడు శిఖామణి

కర్నూలు(రూరల్): కోడుమూరు మాజీ ఎమ్మెల్యే ఎం.శిఖామణి మచ్చలేని నాయకుడు అని వైఎస్సార్ సీపీ కోడుమూరు నియోజక వర్గ సమన్వయ కర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం శిఖామణి 17 వ వర్ధంతిని పురస్కరించుకుని మునగాలపాడు సమీపంలోని ఘాట్‌లో పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కోట్లహర్ష మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన నాయకుడు శిఖామణి అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ, వారి కుటుంబ సభ్యులు, వైస్సార్ సీపీ మండల కన్వీనరు పెరపోగు మోహన్ బాబు, గూడూరు మునిస్పల్ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, పోలకల్ ప్రభాకరు రెడ్డి , కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు , కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే శిఖామణికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



సద్దల సూర్యనారాయణరెడ్డి

పాణ్యం: స్థానిక గిరిజన బాలుర పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయి 25 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలు కావడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సద్దల సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో వసతి గృహాల నిర్వహణను పట్టించుకునే నాథుడే లేరన్నారు. పాత భవనం నుంచి కొత్త భవనంలోకి ఇటీవల మార్చినా సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 228 మంది విద్యార్థులకు రెండే బాత్‌రూమ్‌లు ఉండడం, తాగునీటి పక్కనే సాగునీటి ప్రవాహం, ఆ పక్కనే మురుగునీరు, కంప చెట్లు ఉండడంతో విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటుదన్నారు. బురదలో వంట చేయడం, అక్కడే విద్యార్థులు భోజనం చేస్తూ అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

పొగాకు రైతు సమస్యలను పరిష్కరించాలి

- రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి డిమాండ్

కర్నూలు(సెంట్రల్): తక్షణమే పొగాకు రైతు సమస్యలను పరిష్కరించాలని ఏపీ రైతు సంఘంరాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. క్వింటా పొగాకును రూ. 15 వేలకు కొనుగోలు చేయాల్సిన వ్యాపారులు కేవలం రూ. 1000–2000లకు అడుగుతుండటం దారుణమన్నారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పొగాకు రైతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోందన్నారు. రెండేళ్ల క్రితం పొగాకు క్వింటా అధికంగా రూ.15 వేలకు అమ్ముడుకావడంతో ఎక్కువ మంది పంటను పండించారన్నారు. ఈక్రమంలో గతేడాది ఖరీఫ్‌లో పండిన పంటను వ్యాపారులు కేవలం రూ.10 వేల లోపే కొనుగోలు చేయడంతో అన్నదాతలు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల మొత్తం పొగాకును కొనుగోలు చేయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పినా ఎక్కడా కొనుగోలు చేయడం లేదన్నారు. కేవలం రూ.2వేల లోపే ధరకు అడుగుతుండడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. సమావేశంలో ఏపీ రైతుసంఘం నాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కె.ప్రభాకరరెడ్డి

శ్రమదానం

కర్నూలు (అర్బన్): నగరంలోని కిసాన్ ఘాట్ మీదుగా బస్టాండ్ వెళ్లే రోడ్డు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పాడైపోవడంతో శ్రీను కర్రస్వామి అకాడమి సామాజిక సేవ సభ్యులు శనివారం స్వచ్ఛందంగా రోడ్డును శుభ్రపరిచారు. ఇసుక, కంకర, జేసీబీతో రోడ్డును చక్కగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో అకాడమి సభ్యులు ఐ.శ్రీనివాసులు, జి.యుగంధర్, వెంకటసాయి, ఆజాద్, ప్రభాకర్, రాము నాయక్, రియాజ్, అభిరామ్, రమేష్ పాల్గొన్నారు.